నమస్తే తెలంగాణ



## జూలై నుంచి మద్యం ధరల పెంపు!

మొదటిపేజీ తరువాయి...

మేర అదనపు రాబడి వస్తుందని అంచనా వేసినట్టు తెలిసింది. మద్యం సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30తో ముగియనున్నది. దీంతో జూలై ఒకటి నుంచి కొత్త ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ లోపే మద్యం ధరలు పెంచి, డిస్టిలరీలు, డిస్ట్రిబ్యూటర్లు, సప్లయ్ కంపెనీలతో ఒప్పందాలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నది.

**చీప్ లిక్కర్‌పై మల్లగుల్లాలు..**

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో చీప్ లిక్కర్ ధర ఎక్కువగా ఉంది. ఇంకా ధరలు పెంచితే చీప్ లిక్కర్ వ్యాపారం కుప్పకూలిపోతుందని దీనికితోడు పొరుగు రాష్ట్రాల నుంచి ఎన్డీపీఎల్ మద్యం, ఫేక్ లిక్కర్ అక్రమ రవాణా పెరిగిపోతుందని ఎక్సైజ్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చీప్ లిక్కర్ ధరలను నియంత్రణలో ఉంచాలని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ సూచించినట్టు తెలిసింది. ధరలు పెంచకుండా ప్రభుత్వ ఆదాయం పెరిగేలా కర్ణాటక తరహాలో టెట్రా ప్యాకెట్లను ప్రవేశపెట్టాలని ఆయన సూచించినట్టు తెలిసింది. దీని ద్వారా ప్రతి క్వార్టర్ మీద కనీసం రూ.15 నుంచి రూ.20 వరకు తగ్గుతాయని పేర్కొన్నట్టు సమాచారం.

**రెండు స్లాబుల్లో ధరల పెంపుపై కసరత్తు..**

రెండు స్లాబుల్లో లిక్కర్ ధరలను పెంచే సూచనలతో కూడిన నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. చీప్ లిక్కర్ బ్రాండ్లను యథాతథంగా ఉండనిచ్చి మిగిలిన మూడు క్యాటగిరీల లిక్కర్‌పై ధరలు పెంచాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు ధరల నిర్ణయ కమిటీ 15 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెంచవచ్చని ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచుకునేందుకు ఉత్తర్వులు ఇచ్చింది.

# పెద్ద చెరువు ఫెన్సింగ్‌ను అడ్డుకున్న రైతులు

- ఫార్మా పేరిట ఉపాధిని దెబ్బతీయొద్దు
- పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం
- చెరువుల్ని సంరక్షించాలని డిమాండ్



అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు, మత్స్యకారులు

యాచారం, ఏప్రిల్ 17: రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కుర్మిద్ద పెద్ద చెరువు ఫెన్సింగ్ పనులను ఆ గ్రామ రైతులు, మత్స్యకారులు అడ్డుకున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేస్తే తాము ఎట్ల బతకాలని అధికారులను నిలదీశారు. ఫెన్సింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, చెరువును సంరక్షించాలని వారు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పెద్ద చెరువుకు ఫెన్సింగ్ వేసేందుకు హిటాచీలు, జేసీబీలతో చెట్ల పొదలు, కంప చెట్లు, రాళ్లు, రప్పలు తొలగించే పనులను పోలీసు బందోబస్తు నడుమ అధికారులు చేపట్టారు. విషయం తెలుసుకున్న కుర్మిద్ద రైతులు, మత్స్యకారులు సంఘటనాస్థలానికి చేరుకొని పనులను అడ్డగించారు. దీంతో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి అక్కడికి చేరుకొని ఫెన్సింగ్ వేయడం లేదని, సర్వే కోసం భూమిని చదును చేస్తున్నామని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఫార్మా భూముల సర్వే పేరుతో చెరువుల చుట్టూ ఫెన్సింగ్ వేస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని రైతులు, మత్స్యకారులు మండిపడ్డారు. పశువులు, మూగజీవాలు నీళ్లు తాగేందుకు వీలు లేక అంతరించిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు చుట్టూ కంచె వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. చెరువులను కాపాడాల్సిన అధికారులే కంచె వేయడం సరైంది కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, అధికారుల హెచ్చరికలకు, బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. వెంటనే భూమి చదును చేసే పనులు నిలిపివేయాలని ఆందోళనకు దిగడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవల తాటిపర్తి గ్రామంలోని బంధం చెరువుకు కంచె వేయాలని చూడగా.. రైతులు అడ్డుకున్న విషయం విదితమే.

### చెరువులను కాపాడాలి



ఫార్మాసిటీ భూముల్లో ఉన్న చెరువులు, కుంటలను ప్రభుత్వం కాపాడాలి. చెరువుల చుట్టూ ఫెన్సింగ్ వేస్తే ఊరుకునేది లేదు. ప్రజలకు చెరువులు అన్ని విధాలుగా అందుబాటులో ఉండాలి. మత్స్యకారులు వెళ్లేందుకు వీలుగా దారి వదిలి ఫెన్సింగ్ వేసుకోవాలి. పశువుల కాపరులు చెరువు వద్దకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలి. మూసీ ప్రక్షాళన చేస్తామన్న ప్రభుత్వం ముందు గ్రామీణ ప్రాంతాల చెరువులు, కుంటలను సంరక్షించాలి. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీయొద్దు. అధికారులు, పోలీసులు రైతుల పట్ల అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దు.

- కవుల సరస్వతి, పర్యావరణవేత్త



## తల్లిగా ఎంతో గర్విస్తున్నా!

**తన కుమారుడి గ్రాడ్యుయేషన్ పూర్తిపై ఎమ్మెల్సీ కవిత సంతోషం**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): తన కుమారుడు ఆర్య గ్రాడ్యుయేషన్(ఇంటర్) పూర్తి చేసిన సందర్భంగా ఎమ్మెల్సీ కవిత సంతోషం వ్యక్తంచేశారు. గచ్చిబౌలిలోని ఓక్రిడ్జ్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకు కవిత-అనిల్ దంపతులు హాజరయ్యారు. తన కుమారుడితో కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. 'నీ చేయి పట్టుకొని స్కూల్‌కు పంపించిన మొదటి రోజు నుంచి ఈ రోజు వరకు నీ ప్రయాణం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.. తల్లిగా నేను గర్విస్తున్నాను ' అంటూ భావోద్వేగంతో పోస్ట్ చేశారు.

# రియల్ ఆదాయం పాతాళానికి!

మొదటిపేజీ తరువాయి...

కనిపించలేదు. నాడు రియల్ రాబడి 42 శాతానికిపైగా నమోదైంది. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం (ఎస్‌వోటీఆర్) కూడా పడిపోయింది. 2023-24లో రూ.1,24,146. 19 కోట్లు కాగా, 2024-25 నాటికి రూ.1,24,054.38 కోట్లకు తగ్గింది. అంటే.. రూ.91.81 కోట్ల తగ్గుదల నమోదైంది. కాగ్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ఫిబ్రవరి నెల గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. రెవెన్యూ ఆదాయం ఫిబ్రవరి వరకు రూ.2,21,242.23 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ, రూ.1,36,136.01 కోట్ల ఆదాయమే సమకూరింది. అంటే రేవంత్‌రెడ్డి సర్కారు నిర్దేశించుకున్న ఆదాయం లక్ష్యంలో 61.53 శాతానికి పరిమితమయ్యారు. గత ఏడాది ఇదే కాలానికి రూ.2,16,566.97 కోట్లు రాబడి అంచనా వేయగా, రూ.1,51,947.05 కోట్లు మేరకు చేరుకున్నారు. అంటే లక్ష్యంలో 70.16 శాతం అందుకున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెల వరకు రూ.1,93,029.40 కోట్ల ఆదాయం అంచనా వేయగా, రూ.1,33,850.82 కోట్లకు అంటే.. లక్ష్యం 69.34 శాతం మేరకు చేరారు. రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం ఆదాయ రాబడిలో చతికిలబడుతున్నది.

**గత ఐదేండ్లలో రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు ఫిబ్రవరిలో వచ్చిన రాబడులు**

| సంవత్సరం | ఆదాయం (కోట్లలో) | వచ్చిన ఆదాయం |
|---|---|---|
| 2019-20 | 6,410.34 | 99.91% |
| 2020-21 | 4,227.34 | 42.27% |
| 2021-22 | 10,878.36 | 87.03 % |
| 2022-23 | 12,843.79 | 82.33 % |
| 2023-24 | 12,980.09 | 70.16 % |
| 2024-25 | 7,033.38 | 38.58 % |

**పాతాళానికి రియల్ ఆదాయం**

కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు జోరు మీదున్న స్థిరాస్తి రంగం ఏడాది నుంచి నేలకరిచింది. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి ఏడాది క్రమంగా పెరుగుతూ వచ్చిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం, రేవంత్‌రెడ్డి పాలనలో క్రమంగా తగ్గుముఖం పట్టింది. కాంగ్రెస్ సర్కారు తీసుకున్న హైడ్రా, ఎల్ఆర్ఎస్ వంటి అనాలోచిత చర్యలతో రియల్ ఆదాయం పడిపోయింది. భూములు అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో బిజినెస్ మందగించింది. రాష్ట్ర ఖజానాకు కీలక ఆదాయాన్ని ఆర్జించి పెట్టే స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖకు ప్రభుత్వం నిర్దేశించిన రాబడి లక్ష్యాన్ని 40 శాతం కూడా అందుకోలేకపోయింది. బడ్జెట్‌లో ఫిబ్రవరి నెల ఆదాయం రూ.18,228.82 కోట్లు వస్తుందని అంచనా వేశారు. కానీ, రూ.7,033.38 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అంటే.. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాబడి 38.58 శాతం వద్దే నిలిచిపోయింది. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల (ప్లాట్ల) అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. కేసీఆర్ పాలనలో గడిచిన పదేండ్లలో ఏనాడూ రియల్ రాబడి తగ్గలేదు. పైగా క్రమంగా పెరిగింది. పదేండ్లలో తొలిసారి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం నిర్దేశించిన లక్ష్యంలో సగానికి కూడా చేరలేకపోయింది.

### కేసీఆర్ హయాంలో రాకెట్ వేగం

**కేసీఆర్** పదేండ్ల పాలనలో రియల్ ఎస్టేట్ రంగం రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. భూముల కొనుగోళ్లు, అమ్మకాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖనే రాష్ట్ర ఖజానాకు పెద్ద ఆదాయ వనరుగా మారింది. నాటి సీఎం కేసీఆర్ వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ, గృహ నిర్మాణ రంగాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టారు. తద్వారా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. 2014 తర్వాత రియల్ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. గతంలో రూ.10 లక్షలకు ఎకరం పలికిన భూమి ధర రూ.కోటి వరకు వెళ్లింది. పదేండ్లపాటు ప్రతినెల సగటున స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.8 వేల కోట్లకుపైగా రాబడి వచ్చింది. పదేండ్లపాటు పెరుగుతూ వచ్చిన స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం.. హైడ్రా ద్వారా ఆక్రమణ పేరుతో భవనాల కూల్చివేతలు, వ్యవసాయ ప్రోత్సాహకాలకు కోత విధించడంతో భూముల కొనుగోళ్లు, అమ్మకాలపై ప్రభావం పడింది. స్థిరాస్తి వ్యాపారం ఒక్కసారిగా పడిపోవడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏడాదిన్నర నుంచి నామమాత్రంగా రాబడి వస్తున్నది.

## హారికకు మెరుగైన చికిత్స అందించాలి

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : కుక్కల దాడిలో గాయపడి మూడు నెలలుగా కోమాలో ఉన్న బాలికకు మెరుగైన చికిత్స అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం నందికొండకు చెందిన హారిక కొద్ది రోజుల క్రితం ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన హరిక కోమాలోకి వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులు దవాఖానల చుట్టూ తిప్పుతున్నప్పటికీ నయం కాలేదు. తండ్రి చనిపోవడం, తల్లి మాత్రమే ఉండి కడుపేద జీవితాన్ని గడుపుతున్న హారిక బాధలపై పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పత్రికల్లో వచ్చిన వార్తకు స్పందించి.. బాలిక కుటుంబసభ్యులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. హారిక కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## 14 ఏండ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స

- వైద్యులను అభినందించిన మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): మార్ఫన్ సింన్డ్రోమ్(జన్యుపరమైన రుగ్మత), తీవ్రమైన హెపటోపల్మనరీ సిండ్రోమ్‌తో బాధపడుతున్న 14ఏండ్ల బాలుడికి ఉస్మానియా వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. గురువారం ఉస్మానియా దవాఖానలో వివరాలను వైద్యులు వెల్లడించారు. ఏపీ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా గోకవరానికి చెందిన 14ఏండ్ల బాలుడు జీ నిఖిల్‌రెడ్డి దీర్ఘకాలిక కాలేయ వ్యాధితోపాటు, మార్ఫన్ సిండ్రోమ్, హెపటోపల్మనరీ సిండ్రోమ్‌తో బాధపడుతున్నట్టు వెల్లడించారు. బాలుడి తల్లి లివర్ దానం చేయగా.. గత నెల 7న డాక్టర్ సీహెచ్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్యబృందం సర్జరీని విజయవంతంగా పూర్తిచేసిందని పేర్కొన్నారు. ఈ అరుదైన వైద్య చికిత్స చేసిన ఉస్మానియా వైద్య బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ అభినందించారు.

## తెలంగాణ వైభవం చాటేలా మిస్‌వరల్డ్ పోటీలు

- అధికారులతో సమీక్షించిన మంత్రి జూపల్లి



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్‌వరల్డ్ పోటీలను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో పోటీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. విభిన్న సంస్కృతులకు కొలువైన తెలంగాణ వైభవం ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చాలాప్రాంతాల్లో నిక్షిప్తమై ఉందని, ఆయా ప్రాంతాలకు ప్రపంచ దేశాల సుందరీమణులను తీసుకెళ్లి, అక్కడి గొప్పదనాన్ని వివరించాలని పేర్కొన్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడం ద్వారా పర్యాటకరంగ అభివృద్ధి, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థికవృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 20కిపైగా వేదికల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు మంత్రికి అధికారులు వివరించారు. మరోవైపు పర్యాటకరంగలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

- **అందాల పోటీలు నిర్వహించొద్దు**




హైదరాబాద్ వేదికగా మేలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తూ వామపక్ష మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేశారు. - ఖమ్మం

## పుప్పాలగూడలో ఐటీ నాలెడ్జ్‌హబ్

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): పుప్పాలగూడ పరిసరాల్లోని 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్‌హబ్ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తద్వారా 5లక్షల మంది యువతకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం సచివాలయం లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారితో కలిసి పరిశ్రమలు, రెవెన్యూ అధికారులతో భట్టి స మావేశం నిర్వహించా రు. ఐటీ హబ్‌పై చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీలో వచ్చిన ప్రతి మార్పులో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఏఐలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

## 'ఎక్సైజ్'లో బదిలీలు చేపట్టాలి

- కమిషనర్, అడిషనల్ కమిషనర్‌కు టీజీవో వినతి


హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్‌శాఖలోని ఉద్యోగుల బదిలీలతోపాటు, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీవో సెంట్రల్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ ఖురేషిని కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్సైజ్‌శాఖలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌ల బదిలీలు జరగక 8 ఏండ్లు అవుతున్నదని పేర్కొన్నారు. ఈ విషయంపై మంత్రి జూపల్లి కృష్ణారావుకు అనేకసార్లు విన్నవించామని తెలిపారు. పదోన్నతులు, సర్వీస్‌రూల్స్ సవరణలు, ప్రమాదబీమా తదితర 17 డిమాండ్లను కమిషనర్‌కు వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

## భూభారతిలోనూ తప్పులుంటయ్: రేవూరి

సంగెం, ఏప్రిల్ 17: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంలోనూ తప్పులుంటాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టంలో తప్పొప్పులను సరిచూసేందుకే రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. చట్టంలో ఏమైనా లోపాలు ఉన్నాయని రైతులు చెబితే, అందుకనుగుణంగా విధానాలు పొందుపరిచి అమలు చేస్తుందని పేర్కొన్నారు.

# ఆర్టీఏ సేవలు అవుటాఫ్ సర్వీస్!

- రవాణాశాఖ వెబ్‌సైట్‌లో పనిచేయని ఫోన్‌నంబర్లు
- సమస్యలతో మధ్యలో నిలిచిపోతున్న ఆర్టీఏ సేవలు
- నగదు చెల్లింపు తర్వాత మధ్యలో ఆగిపోతున్న వైనం
- ఆర్టీఏ నిర్లక్ష్యంతో వాహనదారుల ఇబ్బందులు




హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ నుంచి సేవలు పొందాలంటే జనాలకు చుక్కలు కనడుపడుతున్నాయి. ఏం చేయాలో తెలియక వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీఏ అధికారులు మాత్రం ఇవన్నీ చిన్నలోపాలేనని కొట్టిపారేస్తున్నారు. ప్రజలకు 40 రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్తున్నారు. ఆర్టీఏ సేవల్లో ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్, వెహికిల్ రిజిస్ట్రేషన్, పర్మిట్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సర్టిఫికెట్ సంబంధించిన స్లాట్‌బుకింగ్ వంటివే ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వ వెబ్‌సైట్, కాల్‌సెంటర్ల నంబర్లు పనిచేయకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇంకొందరు మీ-సేవ కేంద్రాల బాట పడుతున్నారు. ఇకనైనా ఆర్టీవో ఉన్నతాధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

**అదీ సంగతి!**

ప్రభుత్వంలోని వివిధ విభాగాల మధ్యలో సమన్వయం లేకపోవడం వల్ల కూడా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఆర్టీఏ వ్యవహారంలోనూ అదే జరుగుతున్నదని తెలుస్తున్నది. రవాణాశాఖ, మీ-సేవపై రాష్ట్ర ఐటీ విభాగానికి జవాబుదారీ లేకపోవడంతోనే సేవలకు అంతరాయం కలుగుతున్నదని ప్రభుత్వ వర్గాలే విశ్వసనీయంగా చెప్తున్నాయి. ఈ పరిస్థితి మారకపోతే సమస్యకు పరిష్కారం దొరకదని, ప్రజలకు ఇబ్బందులు తప్పవని స్పష్టం చేస్తున్నారు.

హైదరాబాద్ నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం మీ-సేవ మొబైల్ యాప్ ద్వారా ప్రయత్నించాడు. సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. ల్యాప్‌టాప్ ద్వారా ఆర్టీఏ వెబ్‌సైట్ transport. telangana.gov.inలోకి వెళ్లి వివరాలు అందించాడు. యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించాడు. కానీ గంటల తరబడి నగదు చెల్లింపు ప్రాసెస్‌లోనే ఉన్నట్టు చూపింది. అర్ధాంతరంగా సేవ నిలిచిపోయింది. స్లాట్‌బుకింగ్ నిర్ధారణ కాలేదు, నగదు చెల్లింపు రసీదు రాలేదు. కానీ ఆకౌంట్ నుంచి డబ్బులు కట్ అయ్యాయి. స్క్రీన్‌పై కనిపించే 040-23370081/83/84 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేస్తే 'అవుటాఫ్ సర్వీస్' అనే సమాధానం వస్తున్నది. దీంతో ఆర్టీఏ సేవల కోసం ప్రయత్నించేవాళ్లంతా తీవ్రఅసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

## 262 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : మల్టీజోన్-2లో విధులు నిర్వర్తిస్తున్న 262 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో సైబరాబాద్ కమిషనరేట్ నుంచి అత్యధికంగా 147 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. హైదరాబాద్ సిటీ నుంచి 73, సైబరాబాద్ నుంచి 147, సంగారెడ్డి నుంచి 18, వికారాబాద్ నుంచి 17, డిప్యుటేషన్‌పై ఏడుగురికి హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఉద్యోగోన్నతి పొందిన హెడ్‌కాస్టేబుళ్లు ఐజీ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

# పడిపోయిన భూగర్భ జలాలు

- పాతాళంలోకి జలమట్టాలు
- చాలా జిల్లాల్లో చేతిపంపులకు అందని నీరు
- తెలంగాణలో మూడు నెలల్లో 7.46 నుంచి 9.91 మీటర్లకు పడిపోయిన గ్రౌండ్‌వాటర్
- నిరుడితో పోలిస్తే ఈ ఏడాది అధిక వర్షపాతం నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భూగర్భ జలాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పదేండ్ల పాటు ఉబికివచ్చిన భూగర్భజలాలు ఏడాదిన్నరగా మరింత లోతుకు పడిపోతున్నాయి. ఈ ఏడాది జనవరిలో 7.46 మీటర్ల లోతున ఉన్న జలాలు మార్చి నాటికే 9.91 మీటర్ల దిగవకు పడిపోయాయి. మూడు నెలల్లో దాదాపు మూడు మీటర్ల దిగువకు గ్రౌండ్‌వాటర్ పడిపోయింది. ఇప్పటికే చాలా జిల్లాల్లో చేతి పంపులకు నీళ్లు అందటంలేదు. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ప్రజలకు తాగునీరు అందించే సింగిల్ ఫేస్ మోటార్లు, త్రిఫేస్ మోటార్లకు పూర్తిస్థాయి నీరు అందడంలేదు. ఎండలు మరింత తీవ్రమైన తర్వాత పరిస్థితి ఇంకా జటిలంగా మారనున్నదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. మే నాటికి పరిస్థితి మరింత దిగజారనున్నట్టు భూగర్భజలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 2014-15 నుంచి 2023-24 వరకు గ్రౌండ్ వాటర్ 30 శాతం మేరకు మెరుగైంది. 3.29 మీటర్ల మేరకు గ్రౌండ్ వాటర్ పెరిగింది. కానీ నిరుడు మార్చితో పోలిస్తే ఈ మార్చిలో సగటు 0.22 మీటర్ల మేర నీటి మట్టం పడిపోయింది.

**పదేండ్లు పెరిగిన భూగర్భజలాలు**

2015-2024 మార్చి దశాబ్ద సగటుతో పోలిస్తే మొత్తం 612 మండలాల్లోని 317 మండలాల్లో నీటి మట్టాల్లో పెరుగుదల (0 నుంచి 29.59 మీ.) కనిపించింది. 295 మండలాల్లో నీటి మట్టాల్లో తగ్గుదల (0.02 నుంచి 32.91 మీ.) కనిపించింది. నీటి మట్టాల్లో 2 మీటర్ల కంటే ఎక్కువ పెరుగుదల ఎక్కువగా నిర్మల్, ఆసిఫాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, సంగారెడ్డి, జనగామ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో నమోదైంది. రెండు మీటర్ల కంటే ఎక్కువ తగ్గుదల ఉన్న మండలాలు 74కి పైగా ఉన్నాయి. ఇవి ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, సిరిసిల్ల, సిద్దిపేట, భూపాలపల్లి జిల్లాల్లో ఉన్నాయి.

| వాటర్‌ఇయర్ | వర్షపాతం (మి.మీ) | భూగర్భ జలమట్టాలు(మీటర్లలో) (జనవరి | ఫిబ్రవరి | మార్చి) |
|---|---|---|---|---|
| 2014-15 | 682 | 10.97 | 11.73 | 12.27 |
| 2015-16 | 717 | 13.75 | 14.39 | 14.88 |
| 2016-17 | 1,019 | 9.34 | 10.18 | 10.96 |
| 2017-18 | 841 | 10.04 | 10.97 | 11.9 |
| 2018-19 | 748 | 11.91 | 12.53 | 13.4 |
| 2019-20 | 1033 | 8.88 | 9.7 | 10.51 |
| 2020-21 | 1257 | 6.56 | 7.36 | 8.35 |
| 2021-22 | 1181 | 6.16 | 7.02 | 8.04 |
| 2022-23 | 1389 | 6.22 | 7.34 | 8.02 |
| 2023-24 | 995 | 7.72 | 8.07 | 9.69 |
| 2024-25 | 1056 | 7.46 | 8.68 | 9.91 |

**మార్చిలో ఏ జిల్లాలో జలమట్టం ఎలా?**

| జిల్లా | నీటిమట్టం(మీటర్లలో) |
|---|---|
| 18 జిల్లాలు | 5-10 |
| 12 జిల్లాలు | 10-15 |
| 3 జిల్లాలు | 15 కంటే ఎక్కువ |



- **పది శాతం నీటినీ ఒడిసిపట్టుకోవడం లేదు**

ప్రకృతి సిద్ధంగా పడే వాన నీటి నుంచి పది శాతం కూడా మనం ఒడిసి పట్టుకోలేకపోతున్నాం. రాష్ట్రంలో ఈసారి అధిక వర్షపాతం నమోదైనా ఆ వరద భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. విచ్చలవిడిగా బోర్లు తవ్వకం, చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కావడం వల్ల నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచుకోలేకపోతున్నాం. 40 శాతం మేరకు వర్షపు నీరు సముద్రం పాలవుతున్నది. మరో 40 శాతం మేర నీటి ఆవిరి రూపంలో వెళ్తున్నది. తొమ్మిది శాతం మాత్రమే భూగర్భంలో ఇంకుతున్నది. మిగతా 11 శాతం జలాల నిల్వకు అవకాశం ఉన్నది. కనీసం 20 శాతం జలాలు అయినా ఒడిసిపట్టుకుంటే నీటి కరువు అనేది మనకు ఉండనే ఉండదు.

-కే లక్ష్మ, భూగర్భ జలశాఖ డైరెక్టర్

భూగర్భ జల విభాగం వాడిన పైజోమీటర్లు **1,771**

మార్చి 31 వరకు సగటు వర్షపాతం **76** మి.మీ

సాధారణ వర్షపాతం కంటే ఎంత ఎక్కువ **21%**

మార్చి 31 నాటికి నమోదైన వర్షపాతం **1,056** మి.మీ

యాదాద్రి భువనగిరి జిల్లాలో కనిష్టం **785** మి.మీ

ములుగు జిల్లాలో గరిష్ఠం **1,656** మి.మీ.

సాధారణం కంటే అధిక వర్షపాతం **13 జిల్లాలు** (20%-69%)

సాధారణ వర్షపాతం **20 జిల్లాలు** (0%-19%)

మార్చిలో సగటు భూగర్భ జలమట్టం **9.91** మీటర్లు

అత్యల్పంగా భూగర్భ జల మట్టం జగిత్యాల జిల్లా(5.24 మీటర్లు)

అత్యధికంగా భూగర్భ జల మట్టం మెదక్ జిల్లా (15.72 మీటర్లు) లోతున